# ప్రపంచ ప్రసిద్ధ కథానికలు

అనువాదం

**డా॥ దేవరాజు మహారాజు**

ఎమెస్కో

# విషయసూచిక


| | | | | |
|---|---|---|---|---|
| ఆఫ్రికన్ | లూయిస్ బెర్నార్డో హోన్వానా | 1. | చేతులు | 5 |
| | ఆనంద వాసుదేవన్ | 2. | నల్లకిడ్నీ | 8 |
| అమెరికన్ | విలియం సారోయన్ | 3. | పనితనం | 16 |
| బ్రిటిష్ | సోమర్‌సెట్ మామ్ | 4. | పరిష్కారం | 19 |
| | ఆస్కార్ వైల్డ్ | 5. | ప్రేమ రహస్యం | 24 |
| | జేమ్స్ హాస్లీ | 6. | సీతాకోక చిలుక | 32 |
| | రూపర్ట్ క్రాఫ్ట్–కూకె | 7. | సరైన ఎన్నిక | 37 |
| బంగ్లాదేశ్ | అనీసుజ్జమాన్ | 8. | చూపు | 41 |
| బర్మీస్ | మోమో (ఇన్యా) | 9. | సైనికుడి భార్య | 48 |
| చైనీస్ | హ్యూంగ్ స్యా | 10. | గుండ్రని చిక్కుళ్లు | 55 |
| ఫ్రెంచ్ | ఆల్ఫోన్సే డాడెట్ | 11. | జైలు లోపల | 64 |
| | అజ్ఞాత రచయిత | 12. | ఒక సైనికుడి కథ | 68 |
| ఇటాలియన్ | మాసిమో బొం టెంప్ లై | 13. | అద్దం | 74 |
| జపనీస్ | సాటో హరో | 14. | అరణ్య భవనం | 79 |
| పాలస్తీనా | ఘసన్ కన్ఫానీ | 15. | ప్రతిఘటన | 84 |
| పాకిస్థాన్ | ఫారుఖ్ సర్వర్ | 16. | తోడేలు | 88 |
| | ఇస్మాయిల్ గౌహర్ | 16. | తీర్పు | 93 |
| పోర్చుగీసు | అఫొన్సో బొటెల్ హో | 17. | ఒక 'టీ' ప్రహసనం | 97 |
| రష్యన్ | లియో టాల్‌స్టాయ్ | 18. | పిల్లలే నయం | 104 |
| | మాక్జిం గోర్కీ | 19. | ప్రేమలేఖలు | 108 |
| | ఫియోడోర్ సోలగోబ్ | 20. | బాల్యం | 115 |
| | అలెగ్జాండర్ కుప్రిన్ | 21. | గన్నేరు పొదలు | 120 |
| స్పానిష్ | హెర్నాండో టెల్లెజ్ | 22. | యుద్ధం | 126 |
| | జోసె ఫ్రాన్సెస్ | 23. | అభినయం | 132 |

ఆఫ్రికన్ కథ

# చేతులు

మూలం : **లూయిస్ బెర్నార్డో హోన్వానా**

**అ**సలు ఆ ప్రసక్తి ఎలా వచ్చిందో గుర్తులేదు. కాని కొన్ని శతాబ్దాలకు ముందు వరకు నీగ్రోలు అడవి జంతువుల్లాగా నాలుగు కాళ్లతో నడిచేవారని, సూర్యరశ్మి సోకనందువల్ల వారి అరికాళ్లు, అరచేతులు మిగతా శరీరం కంటే తెల్లగా ఉంటాయని ఓ రోజు టీచర్ చెప్పింది. అయితే ఫాదర్ క్రిస్టియనో అభిప్రాయం విన్నాక నేను మళ్లీ ఆలోచనలో పడ్డాను. అరచేతులు తెల్లగా ఉండడానికి కారణం అది కాదని, ఎల్లవేళలా చేతులు జోడించి రహస్యంగా దైవప్రార్థనలు జరపడంవల్ల అలా జరిగిందని ఫాదర్ చెప్పాడు. ఆ రకంగా మనకంటే వాళ్లే నయమని, దేవుడికి సన్నిహితులనీ చెప్పాడు. నాకు విచిత్రంగా తోచింది. దాంతోపాటు ఆసక్తి కూడా పెరిగింది. నల్లవాళ్ల అరిచేతులు తెల్లగా ఎందుకుంటాయని అప్పటి నుండి అందరినీ అడగడం మొదలుపెట్టాను. ఎవరికి తెలిసింది వాళ్లు చెప్పేవారు.

డోనాడోరిస్ చెప్పిందేంటంటే యజమానులకు, దొరలకు... వారు తయారుచేసే ఆహారం శుభ్రంగా ఉండడం కోసం, దేవుడు వారి చేతుల్ని అలా తెల్లగా తయారుచేశాడు. యజమానుల ఆజ్ఞ ప్రకారం బానిసలు అన్నీ శుభ్రం చేసి పెట్టాలి కదా మరి!

సెన్‌హూర్ ఆంటూన్స్ అని ఒక కోకకోలా అబ్బాయున్నాడు. అతను ఊళ్లోకి అప్పుడప్పుడు వస్తుంటాడు. క్యాంటీన్‌లో కోకకోలా, ఇతరపానీయాలు అయిపోయి నప్పుడు వస్తుంటాడు. ఇంతవరకు నేను తెలుసుకున్న విషయాలన్నీ పచ్చి అబద్ధాలని అతను తేల్చేశాడు. అబద్ధాలు అవునో, కాదోనని నేను అనుమానపడ్డాను. అనుమానం

అక్కరలేదనీ, అన్నీ పచ్చి అబద్ధాలేననీ అతడు నాకు హామీ ఇచ్చాడు. అలా అని నాతో ఒప్పించిన తరువాతనే తనకు తెలిసిన విషయాలు చెప్పాడు.

చాలా ఏళ్ల క్రితం ఏసుక్రీస్తు, మేరీమాత, సెయింట్ పీటర్ మొదలైన మహానుభావులు, దేవదూతలు, భూలోకంలో చనిపోయిన పుణ్యాత్ములు, అందరూ స్వర్గంలో ఉన్నప్పుడు ఓసారి సమావేశమయ్యారు. సరదాగా నల్లవాళ్లని తయారు చేద్దామని నిర్ణయించుకున్నారు. దేనితో చేద్దామనుకున్నారో తెలుసా? మట్టితో! బంకమట్టి బాగా కాల్చారు. పని తొందరలో ఉన్నందువల్లనో ఏమో గాని, కొద్దిసేపటి తరువాత బొమ్మల్ని పొగగొట్టానికి తగిలించి వెళ్లారు. పొగ గొట్టంలో పొగకేం కరవు? పొగే పొగ! బాగా పొగ బట్టి బొమ్మలు బొగ్గుల్లాగా అయ్యాయి. బొమ్మల అరచేతులు పొగబట్టకుండా ఎలా ఉన్నాయి అంటే చేతుల్ని పొగ గొట్టానికి తగిలించారు కదా మరి? అందుకన్నమాట నల్లవాళ్ల చేతులు తెల్లగా ఉండడం.

సెన్‌హూర్ ఆంటూన్స్ నాకీ విషయం చెబుతున్నప్పుడు, మా చుట్టూ ఉన్నవాళ్లంతా శ్రద్ధగా కథ విన్నట్టు విన్నారు. కడుపుబ్బ నవ్వుకున్నారు. ఆంటూన్స్ వెళ్లిపోయాడు. ఆ తరువాత సెన్‌హూర్ ఫ్రయాస్ నన్ను పిలిచి, ఆంటూన్స్ చెప్పిందంతా అబద్ధమన్నాడు. అతని కంటే ముందు వాళ్లు చెప్పిన విషయాలు గుర్తుచేస్తే, అవి కూడా అబద్ధాలేనని కొట్టిపారేశాడు. నిజం తనొక్కడికే తప్ప ఎవరికీ తెలియదని చెప్పాడు. దేవుడు మనుషుల్ని తయారుచేసిన తరువాత వాళ్లని స్వర్గంలోని ఒక కొలనులో స్నానంచేసి రమ్మన్నాడట. స్నానం చెయ్యగానే తెల్లగా, అందంగా తయారవుతారని చెప్పాడట. వాళ్లు పాపం, దేవుడి చేతిలో తెల్లవారుజామున పుట్టారు. అసలే చలి. అందులో కొలనులోని నీరు మరీ చల్లగా ఉన్నాయి. స్నానం చెయ్యలేక అరచేతులు, అరికాళ్లు మాత్రమే తడుపుకుని ఈ లోకంలోకి వచ్చి పడ్డారట.

కొంతకాలానికి నేనొక పుస్తకం చదివాను. అందులో నల్లవాళ్ల ప్రసక్తి ఉన్నందువల్ల మరికొంత ఆసక్తిగా చదివాను. నడుములు వంచి, వర్జీనియా తెల్లదూది ఏకుతూ జీవితాంతం వెళ్లదీస్తారు గనక, వారి చేతులు తెల్లగా ఉంటాయని అందులో రాసుంది. కాని డోనా ఈస్టిఫానియా ఆ విషయం ఒప్పుకోలేదు. అస్తమానం గుడ్డలు ఉతుకుతూ ఉండడంవల్ల సబ్బు చేతుల్ని తినేసి అలా తెల్లగా అవుతాయని అందామె. ఏమో ఇంతమంది ఇన్ని రకాలుగా చెబుతూ ఉంటే ఏది నిజమో, ఏది కాదో నేనెప్పుడూ ఆలోచించలేదు. "నల్లవారి అరచేతులు, అరికాళ్లు మిగతా శరీరం కంటే తెల్లగా ఉంటాయన్నది మాత్రమే నిజం" అని నేననుకున్నాను.

అందరూ చెప్పిన దానికంటే బహుశా మా అమ్మ చెప్పిందే నిజమై ఉంటుంది. ఆమె ఎప్పుడూ అబద్ధాలు చెప్పదు. అనుభవంలోంచి వచ్చిన జీవితసారం చెబుతుంది. ఒకరోజు ఈ విషయాలు స్నేహితులతో మాట్లాడుతున్నప్పుడు ఆమె విన్నది. మా అమాయికత్వానికి తెరలు తెరలుగా నవ్వుకుంది. ఆ తరువాత విషయం ఇదీ అని ఆమె ఒక్కసారిగా ఏదీ చెప్పలేదు. సందర్భం వచ్చినప్పుడల్లా నల్లవాళ్ల గురించి ఏవేవో విషయాలు చెబుతూ ఉండేది. అవి వింటున్న కొద్దీ, నేనాలోచించుకోవాల్సి వచ్చింది.

ఓసారి ఇలా చెప్పింది. "దేవుడు నీగ్రోలను తయారుచేయాలి గనుకనే చేశాడురా తండ్రీ! వారి అవసరం ఈ ప్రపంచం మీద చాలా ఉందనే తయారుచేశాడు. కానీ చేసిన తరువాత ఎంతో పశ్చాత్తాపం చెందాడు. తెల్లవాళ్లు వాళ్లని మనుషులుగా పరిగణించకపోవడం, బానిసల్ని చేసి ఇళ్లకు తీసుకుపోయి వారితో నానా చాకిరీ చేయించుకోవడం చూసిన తరువాత, దేవుడు ఎంతో దుఃఖించాడు. అందరినీ సమానంగా తెల్లగా సృష్టించలేకపోయినందుకు తన అశక్తతను తానే అసహ్యించుకున్నాడు. కాని ఒకటి మాత్రం సరిగా చేశాడు. తెల్లవాళ్లయినా, నల్లవాళ్లయినా అరచేతులు, అరికాళ్లు మాత్రం ఒకేవిధంగా ఉండేట్టు చేశాడు. ఎందుకో తెలుసా? బహుశా నీకు తెలియదు. నువ్వంటే పోనీ చిన్నవాడివి. చాలా మంది పెద్దవాళ్లకే తెలియదు. ఏం చేస్తాం!" అని ఆమె ఆశ్చర్యం ప్రకటించింది.

"మనిషి మనిషి పనే చేయాల్సి వస్తుందని చూపడానికి అలా చేశాడు. మనిషి తాను చేయించానని గర్వంగా చూసుకునే పని. తనలాంటి మనుషులే తనకున్నటువంటి చేతులతోనే చేశారని గుర్తుంచుకోవడానికి అలా చేశాడు. అంటే ఏ మాత్రం విజ్ఞత ఉన్నా మనుషులంతా ఒక్కటేనని గ్రహించాలన్నమాట! తమను నల్లగా పుట్టించలేదని దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకునే మనుషులు, కష్టించి పనిచేసే నల్లవాడి చేతుల గొప్పతనాన్ని గుర్తించాలన్నమాట" అంటూ అనేకవిషయాలు చెప్పింది అమ్మ.

నన్ను దగ్గరికి తీసుకుని నా నల్లని చేతుల్ని తన తెల్లని అరచేతులతో పైకి తీసుకొని ముద్దు పెట్టుకుంది.

నేను వదిలించుకుని ఆరుబయట బంతి ఆడుకోవడానికి పరిగెత్తాను.

అమ్మ చెప్పిన విషయాలు మెదడులో తిరుగుతూనే ఉన్నాయి. నిజమే! ఎవరూ కొట్టకుండానే ఏడ్చి బొబ్బలు పెట్టే పిల్లవాణ్ణి నేనింతవరకు చూడలేదు.

★ ★ ★